22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): పలు శాఖల్లోని ఇంజినీర్ ఉద్యోగాల భర్తీలకు ఈ నెల 22 నుంచి నవంబర్ 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన వారికి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తామని కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి: యూటీఎఫ్

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బాకీపడ్డ పెండింగ్ డీఏలు, బిల్లులను తక్షణమే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధులు జంగయ్య, చావరవి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. కాగా, జీవో-317 బాధితుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి కోరారు.

'జీవో 28 అభ్యర్థులకు న్యాయం చేయాలి'

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ 2008లో జీవో-28తో నష్టపోయిన బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ట్రైబల్ టీచర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఎంబీబీఎస్‌కు గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్7 (నమస్తే తెలంగాణ): నీట్ ఎంబీబీఎస్ అడ్మిషన్లలో 174 మంది సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ విద్యార్థులు సీట్లు కైవసం చేసుకున్నారు. 438 ర్యాంకుతో గాంధీ మెడికల్ కాలేజీలో సాయి వంశీ, 1,791 ర్యాంకుతో హేమంత్, 3,378 ర్యాంకుతో శృతి ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీట్లు దక్కించుకున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సొసైటీ కార్యదర్శి వర్షిణి అభినందించారు.

ఆర్టీసీకి అద్దె బస్సుల గండం!

- తగ్గుతున్న సొంత బస్సులు, కార్మికులు
- త్వరలో వెయ్యి ప్రైవేట్ ఈవీ బస్సులు
- మహాలక్ష్మి పథకం బస్సులపై చిన్నచూపు
- సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులపైనే ఆసక్తి
- ప్రైవేటీకరణ వైపే ఆర్టీసీ అడుగులు?

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీకి అద్దె బస్సులతో ప్రమాదం పొంచి ఉన్నదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక సొంత బస్సులను కొనుగోలు చేయకుండా అద్దె బస్సులను ప్రవేశపెట్టడం వారి అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. తెలంగాణ ఏర్పడినప్పుడు ఆర్టీసీకి 10,450 బస్సులు, 57,254మంది కార్మికులు ఉండేవారు. ఈ ఏడాది జూన్‌నాటికి బస్సుల సంఖ్య 9,149, సిబ్బంది సంఖ్య 40,415 మందికి పడిపోయింది. గతంలో అద్దె బస్సులు 1,431 మాత్రమే ఉండగా, ఇప్పుడవి 2,750కి పెరగడం ఆందోళనకర పరిణామమని కార్మికులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్క్రాప్ బస్సుల స్థానంలో కొత్తవి తెచ్చారు కానీ, అదనపు బస్సులను తేలేదని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం బస్సులైన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రవేశపెట్టకుండా యాజమాన్యం ఈవీ బస్సుల పేరిట ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ సూపర్‌లగ్జరీ బస్సులను ప్రవేశపెడుతున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఎలక్ట్రిక్ బస్సుల పేరిట చేస్తున్న హంగామా చూస్తుంటే, సంస్థకు పొగబెట్టేలా ఉన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీలో దశలవారీగా 2,400 ఈవీ బస్సులు రానున్నాయని, వీటిని అన్ని జిల్లాల్లోనూ ప్రవేశపెట్టనున్నట్టు కరీంనగర్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. అయితే, వాటిని ప్రైవేటు ఆపరేటర్ల ద్వారానే ప్రవేశపెడతారని సమాచారం. జీహెచ్ఎంసీ పరిధిలోనే 800 ఈవీ బస్సులు వస్తున్నాయి. జిల్లాల్లో కూడా 200 బస్సులు తీసుకొస్తున్నారు. ఈవీ బస్సుల కాంట్రాక్టు విధానం బయటకు చెప్పడం లేదని, యాజమాన్యం దృష్టి ప్రైవేటీకరణ వైపే సాగుతున్నదని కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇంకా నెరవేరలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వెయ్యి బస్సులు ఇన్.. 4వేల మంది ఔట్

ఆర్టీసీ నిబంధనల మేరకు ఒక బస్సుకు ఆరుగురు కార్మికులు సేవలు అందించాలి. ప్రైవేట్ బస్సులు పెరిగితే క్రమంగా ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని కార్మికులు చెప్తున్నారు. వెయ్యి బస్సులు ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా వస్తున్నాయంటే, రెండు వేల మంది డ్రైవర్లు, వెయ్యి మంది శ్రామికులు, మరో వెయ్యి మంది హెల్పర్లను ఆర్టీసీ కోల్పోయినట్టేనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎట్టకేలకు ఫార్మసీ ప్రవేశాల షెడ్యూల్

రెండు విడతల్లో సీట్లు భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ఎప్‌సెట్ బైపీసీ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఎట్టకేలకు నాలుగు నెలలు ఆలస్యంగా కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఫార్మసీ కౌన్సిల్ అనుమతులివ్వడంలో తీవ్ర జాప్యం చేయడంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది. మొత్తం రెండు విడతల్లో సీట్లు భర్తీచేస్తారు. మొదటి విడత షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 19 నుంచి 22లోపు ప్రాసెసింగ్ ఫీజు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుకింగ్, 21 నుంచి 23లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 21 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 28న సీట్ల కేటాయింపు, 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకుని, ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తుది విడత షెడ్యూల్‌లో భాగంగా నవంబర్ 4న ప్రాసెసింగ్ ఫీజు, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు స్లాట్ బుక్ చేసుకోవాలి. 5న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 5, 6న వెబ్ ఆప్షన్ల నమోదు, 9న సీట్ల కేటాయింపు ఉంటుంది. 9 నుంచి 11లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్, ట్యూషన్ ఫీజు చెల్లింపు, 11, 12న రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 12న స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలు విడుదల చేస్తారు.

మధ్యంతర బెయిల్ రద్దు చేయండి

కోర్టులో జానీ మాస్టర్ న్యాయవాది మెమో

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబర్ 7: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. జాతీయ ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డును అందుకునేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉన్నదని జానీ మాస్టర్ విన్నవించడంతో ఇటీవల కోర్టు ఆయనకు 4 రోజుల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. కానీ, అనుహ్యంగా నిర్వాహకులు ఆ అవార్డును రద్దు చేయడంతో జానీ మాస్టర్ ఢిల్లీ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది దాఖలు చేసిన మెమోను కోర్టు అనుమతించింది. కాగా, ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ కోసం జానీ మాస్టర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 9కి వాయిదా వేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి

- 4 నెలల్లోగా ఆ కేటాయింపులను రద్దు చేయాలి
- 17 ఏండ్ల నాటి పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు
- ఇందూ టెక్, బ్రాహ్మణి తదితర కంపెనీలకు ఎదురుదెబ్బ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజనకు ముందు 2001-06 మధ్యకాలంలో ప్రభుత్వం నుంచి భూములను పొంది పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల నుంచి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల నుంచి భూమిని స్వాధీనం చేసుకోలేదన్న పిటిషనర్ వాదన సమర్థనీయమేనని పేర్కొంటూ.. ఇందూ టెక్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్, స్టార్జ్ ప్రాపర్టీస్, అనంత టెక్నాలజీస్, జెటీ హోల్డింగ్స్ తదితర సంస్థలకు జరిపిన భూ కేటాయింపులను 4 నెలల్లోగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2001-06 మధ్య కాలంలో ఎలాంటి ప్రకటన లేకుండా, వేలం నిర్వహించకుండా నామినేషన్ విధానంలో అమ్మకం, లీజు ప్రాతిపదికపై 4,156 ఎకరాల భూమిని పలు కంపెనీలు, వ్యక్తులకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ 2007లో చత్రి అనే స్వచ్ఛంద సంస్థ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేయడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఇటీవల ఈ తీర్పును వెలువరించింది.

కొత్త టీచర్లు 10వేలే..

- అడ్డంకిగా వివాదాలు, కోర్టు కేసులు
- పలు కారణాలతో నిలిచిన కొన్ని పోస్టుల భర్తీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): 11వేల టీచర్ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసినా ప్రస్తుతం 10వేల మంది టీచర్లకు ప్రభుత్వం కొలువులివ్వనున్నది. మిగతా పోస్టుల భర్తీకి వివాదాలు, కోర్టుకేసులు అడ్డంకిగా నిలిచాయి. పలు కారణాలతో 13 జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పోస్టుల భర్తీకి బ్రేక్‌లు పడ్డాయి. 10 వేల మంది కొత్త టీచర్లకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు ఇవ్వనున్నారు. సోమవారం అర్ధరాత్రి 1:1 జాబితాను జిల్లాలకు పంపించారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగలకుండా అధికారులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంకా డీఎస్సీకి పలు వివాదాలు వెంటాడుతున్నాయి.

ప్రత్యేక టెట్‌పై కోర్టుకు..

డీఎస్సీ నియామకాలకు ముందు మరో వాదన బయటికొచ్చింది. వాస్తవానికి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు 21 రకాల వైకల్యాలున్న వారికి బోధిస్తారు. సబ్జెక్టులు సైతం వేరుగా ఉంటాయి. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించకుండా, కానీ వీరికి రెగ్యులర్ టెట్‌ను రాసుకునే అవకాశమిచ్చారు. అప్పట్లో అభ్యర్థులు అభ్యంతరాలు లేవనెత్తారు. కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 13 జిల్లాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీ నిలిచిపోయింది. మిగతా జిల్లాలతోపాటే పోస్టింగ్స్ ఇవ్వాలని కొందరు సైఫాబాద్‌లోని డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు.

సైబర్ నేరగాళ్లపై 18 ఎల్‌వోసీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 18 మందిపై లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ)జారీచేశారు. మిగతా నిందితుల వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. వివిధ రాష్ట్రాల్లో సీసీఎస్ సైబర్‌క్రైమ్ బృందాలు అరెస్ట్ చేస్తున్న వారిలో ఎక్కువగా బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు ఖాతాలను సేకరించేవారే ఉంటున్నారు. ఖాతాదారులు, ఖాతాదారుల నుంచి డబ్బు సేకరించి ఏజెంట్లు ఆపై ఉండే వాళ్లకు క్రిప్టో కరెన్సీలో డబ్బు పంపిస్తున్నారు. అది ప్రధాన నిందితులకు చేరుతున్న నేపథ్యంలో విదేశాల్లోని సైబర్ నేరగాళ్ల పాస్‌పోర్టు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పాత నేరస్థుల డాటాను సేకరించే పనిలో ఉన్నారు. గతంలో ఎల్‌వోసీ జారీ చేస్తే ఖట్మాండ్ మీదుగా భారత్‌లోకి ప్రవేశిస్తుండగా, పోలీసులు పట్టుకొని సైబరాబాద్ పోలీసులకు అప్పగించారు.

నకిలీ బ్యాంక్ అధికారుల అరెస్టు

- తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని మోసం
- 28 మంది రైతుల నుంచి రూ.26 లక్షల వసూలు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్రపవార్

నీలగిరి, అక్టోబర్ 7: తాము బ్యాంకు అధికారులమని చెప్పుకుంటూ.. తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని రైతులను మోసం చేస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేసిన ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్ట్ చేసినట్టు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం నల్లగొండలో మాట్లాడుతూ.. ఏపీ లింగోటానికి చెందిన షేక్ వజీర్, వెలుగూడేనికి చెందిన కట్టెబోయిన పరమేశ్, వెంకటాద్రిపాలేనికి చెందిన మమ్ముల జ్యోతిస్వరూప్, చిరుమర్తికి చెందిన కొండా శ్రీను, మిర్యాలగూడకు చెందిన గోగుల సురేశ్, జప్తివీరప్పగూడేనికి చెందిన చిలుముల సైదులు, తెప్పలమడుగుకు చెందిన పల్లెబోయిన నాగరాజు, నార్కట్‌పల్లికి చెందిన ముప్పిడి సైదులుతో కలిసి టీమ్‌గా ఏర్పడ్డారు. వీరంతా గ్రామాల్లో తిరుగుతూ రైతుల వద్దకు వెళ్లి భూములు తనఖా పెట్టి తక్కువ వడ్డీకి ఎక్కువ మొత్తంలో రుణాలను ఇస్తామని చెప్తూ తమ ముఠా సభ్యులతో ఫోన్లో మాట్లాడిస్తున్నారు. మిగతా సభ్యులు తాము బ్యాంకు అధికారులుగా చెప్పుకుంటూ రైతులతో ఫోన్లో మాట్లాడి వారికి రుణాలు ఇప్పిస్తామని నిమ్మించేవారు. 28 మంది రైతుల నుంచి సుమారు రూ.26 లక్షల వరకు వసూలు చేసినట్టు ఎస్పీ తెలిపారు. హాలియాలో ఓ వ్యాపారికి సోషల్ వెల్ఫేర్ నుంచి అధిక మొత్తంలో రుణం ఇప్పిస్తామని చెప్పి తిరుగుతుండగా పెద్దవూర పోలీసులు పట్టుకున్నట్టు వివరించారు. కేసులో ప్రధాన నిందితుడైన షేక్ నజీర్ పరారీలో ఉన్నట్టు చెప్పారు.

విషజ్వరంతో చిన్నారి మృతి

వర్షిత(ఫైల్)

ములుగురూరల్, అక్టోబర్ 7: విషజ్వరం బారిన పడి ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం ములుగు జిల్లా ములుగు మండలం పత్తిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాటోత్ కవిత-జయపాల్ దంపతులకు కొడుకు హర్షవర్ధన్ 4వ తరగతి, 1వ తరగతి చదువుతున్న కుమార్తె వర్షిత (8) ఉన్నారు. వారం రోజుల నుంచి వర్షిత విషజ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు ములుగులోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుడు చిన్నారిని అడ్మిట్ చేసుకొని మూడు రోజుల వరకు వైద్యం చేశాడు. ఆదివారం వర్షిత కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి విషమంగా ఉందని, తాను ఏమీ చేయలేనని, మెరుగైన చికిత్స కోసం హనుమకొండకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని హనుమకొండలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

రత్నకుమారి(ఫైల్)

తాడ్వాయి, అక్టోబర్ 7: ఆర్ఎంపీ అందించిన వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరిగింది. జంపంగ వాయికి చెందిన రత్నకుమారి(43) ఊరట్టం పోస్టాఫీస్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్నది. నాలుగు రోజుల క్రితం ఆమె కు తీవ్ర జ్వరం రావడంతో నార్లాపురంలోని ఆర్ఎంపీని సంప్రదించగా, మందుగోలీలు ఇస్తూ తగ్గుతుందని ఇంటికి పంపించాడు. ఆదివారం మళ్లీ జ్వరం రావడంతో ఆర్ఎంపీ దగ్గరికి వెళ్లగా సెలైన్ బాటిళ్లు ఎక్కిస్తూ, అందులో ఇంజెక్షన్‌లు వేస్తూ వైద్యం అందించాడు. గంట తర్వాత ఆమె ఆరోగ్యం విషమంగా మారడంతో డెంగ్యూ జ్వరం వచ్చిందని, వెంటనే ములుగు దవాఖానకు తీసుకువెళ్లాలని సూచించి చేతులు దులుపుకున్నాడు. ములుగు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు తరలించాలని వైద్యులు సూచించడంతో అంబులెన్సులో తీసుకెళ్తుండగా మార్గమాధ్యంలో రత్నకుమారి మృతిచెందింది. ఆర్ఎంపీ రాజ్‌కుమార్ అర్హతకు మించి వైద్య అందించడం వల్లే రత్నకుమారి మృతి చెందిందని ఆరోపిస్తూ.. మృతురాలి కుమారుడు భాస్కర్ డీఎంహెచ్‌వో అప్పయ్యకు ఫిర్యాదు చేశాడు.

గాంధీభవన్‌లో 95 దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన మంత్రి ముఖాముఖీ కార్యక్రమంలో 95 దరఖాస్తులు వచ్చాయి. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరై అర్జీలు స్వీకరించారు. మరోవైపు వెంటనే గ్రూప్-4 రిజల్ట్స్ ప్రకటించాలని సుమారు 30 మంది అభ్యర్థులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని ధర్నా నిర్వహిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

దళితబంధు నిధులు విడుదల చేయండి

హుజూరాబాద్‌లో డీఎస్పీ నాయకుల ధర్నా

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7: దళితబంధు రెండో విడత నిధులు వెంటనే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చిలువేరు శ్రీకాంత్ మాట్లాడుతూ.. హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని పోరాడుతున్న కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రెండేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గాన్ని దళితబంధు పథకానికి పైలట్ ప్రాజెక్టు కింద ఎంచుకున్నదని, రెండో విడత నిధులు లబ్ధిదారుల అకౌంట్లలో ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకుండా ఆపిందని మండిపడ్డారు. వెంటనే నిధులు విడుదల చేసి దళితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చేప పిల్లల పంపిణీలో సర్కారు తీరుపై అసహనంగా మాట్లాడుతున్న మంథని మత్స్య శాఖ అధ్యక్షుడు క్రాంతికుమార్, పక్కన వేదికపై రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్

కాలం పోయిన తర్వాత చేప పిల్లలు పంచుతరా..?

- ఇప్పుడు విడుదల చేస్తే అవి ఎప్పుడు ఎదుగుతయి
- ఈ విత్తనాలు మాకొద్దు.. నగదు జమచేయండి
- మంథనిలో చేప పిల్లల పంపిణీ రసాభాస
- చెరువులు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోరా?
- మత్స్యశాఖ చైర్మన్‌ను నిలదీసిన స్థానికులు

మంథని, అక్టోబర్ 7: 'కాలం దాటిపోయిన తర్వాత చేప పిల్లలను చెరువుల్లో వేస్తే అవి ఎప్పుడు ఎదుగుతయి.. తామెప్పుడు పట్టుకోవాలి' అంటూ మత్స్యకారులు రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌పై అసహనం వ్యక్తం చేశారు. చేప పిల్లల విడుదల కార్యక్రమం రసాభాసగా మారిన ఘటన పెద్దపల్లి జిల్లా మంథనిలోని తమ్మ చెరువులో చోటు చేసుకుంది. సోమవారం రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ తుమ్మచెరువులో ఉచిత చేప పిల్లలను వదిలారు. అనంతరం మంథని మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పోతరవేన క్రాంతికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు అక్టోబర్‌లో అది కూడా 50శాతం పంపిణీ చేస్తే ఏం ప్రయోజనమని, చేప పిల్లలు ఎదుగవని వాపోయారు. ఈ చేప పిల్లల పంపిణీ అక్కర్లేదని, మత్స్యకారులకు నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతుండగా.. స్థానికుడైన గుడి అశోక్‌కుమార్, మత్స్యకారులు కలుగజేసుకొని తమ్మి చెరువుతోపాటు పట్టణంలోని చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని, ఈ విషయమై ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓవైపు మత్స్యకారులు, మరోవైపు స్థానికులు అడ్డుతగలడంతో కార్యక్రమం రసాభాసగా మారింది. పోలీసులు వచ్చి శాంతింపజేశారు.

హైదరాబాద్ నుంచే 'విశాఖ హనీట్రాప్'

- గ్యాంగ్ సభ్యులుగా 15 మంది?
- 3 బ్యాంక్ అకౌంట్లు హైదరాబాద్ నుంచే నిర్వహణ
- పదుల సంఖ్యలో బాధితులు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : అందమే వాళ్ల పెట్టుబడి. డబ్బున్న మగాళ్లే వారి టార్గెట్. హస్కీ వాయిస్‌తో మాటాల్లోకి దించుతారు. పరిచయాలు, చాటింగ్స్, డేటింగ్స్, వీడియోకాల్స్‌తో మెల్లగా రంగంలోకి దించుతారు. ప్రేమ, పెళ్లి అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత అందినకాడికి దోచేస్తారు. విశాఖలో వెలుగుచూసిన 'హనీట్రాప్' అలాగే జరిగింది. ఈ ట్రాప్‌లో కీలక సూత్రధారి అయిన జమీమా అండ్ కో.. మొదట ఓనమాలు దిద్దింది హైదరాబాద్‌లోనే. ఇక్కడ పదుల సంఖ్యలో డబ్బున్న వారిని వంచించిన తర్వాతే వైజాగ్‌కు షిఫ్ట్ అయినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో మోసపోయిన వారిలో ఎక్కువగా ధనవంతులు, పెండ్లయినవారే ఉండటంతో ఏ ఒక్కరూ ఫిర్యాదులు చేయలేదని సమాచారం. దీనిని వెలుగులోకి తెచ్చిన విశాఖపట్నం సీపీ బాగ్చీ సైతం హైదరాబాద్‌లోని బాధితులు తమకు రహస్యంగానైనా వివరాలు చెప్పాలని కోరుతున్నారు.

మూడు బ్యాంక్ అకౌంట్లు..

విదేశాల్లో స్థిరపడ్డ, బాగా సంపాదించిన మగవాళ్లను లక్ష్యంగా చేసుకొని మోసాలు చేస్తున్న ఈ గ్యాంగ్‌లో మొత్తం 15 మంది వరకు సభ్యులు ఉన్నట్టు సమాచారం. వీరు నిర్వహిస్తున్న బ్యాంకు అకౌంట్లు హైదరాబాద్‌లో ఓపెన్ చేసినవే కావడటంతో ఇక్కడ కూడా వారి మూలాల కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎన్నారైలకు అందమైన ఫొటోలు షేర్ చేసి ఆకర్షించడం, ప్రేమపెళ్లి పేరుతో లైన్‌లో పెట్టడం వీరి దినచర్య. ఎవరైతే వీరి వీడియోలకు లైక్‌లు, కామెంట్లు చేస్తారో వారి అకౌంట్లు, హోదా, అంతస్తు తదితర విషయాలను గమనించి వారిని లైన్‌లో పెడుతారు. రొమాంటిక్ వీడియోకాల్స్ చేసి స్వీట్‌గా మాట్లాడుతూ.. ఆ తర్వాత మెల్లిగా పెండ్లి ప్రపోజల్ తీసుకొస్తారు. 'అమ్మానాన్నలతో మాట్లాడిన తర్వాతే ఏదైనా'.. అంటూ నమ్మిస్తారు. ఆ తర్వాత ఓ ఇంటి అడ్రస్ ఇస్తారు. ఒకవేళ అతను కచ్చితంగా వస్తాడని తెలిస్తే.. అప్పటికే ఓ సినిమా స్టైల్‌లో నకిలీ పేరెంట్స్‌ను రంగంలోకి దించుతారు. వారికి ఏం చెప్పాలో ట్రైనింగ్ కూడా ఇస్తారు. అంతా ఓకే అనుకున్న తర్వాత.. వాళ్లే ఓ ప్లేస్ చెప్పి అక్కడికి రమ్మంటారు. రొమాన్స్ పేరుతో మత్తుమందు కలిపిన మందు తాపించి, డ్యాన్స్‌లు చేయించి సోయితప్పేలా చేస్తారు. ఆ తర్వాత వారిని నగ్నంగా మార్చి ఫొటోలు, వీడియోలు తీసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. అడిగినంత ఇవ్వకపోతే ఫొటోలు సోషల్‌మీడియాలో పెడతామని బెదిరిస్తారు. ఇలా మోసపోయిన బాధితుల్లో హైదరాబాద్ వారు పదుల సంఖ్యలో ఉండగా, వైజాగ్‌లో మరింత మంది ఉన్నట్టు విశాఖపట్నం పోలీసులు చెబుతున్నారు.

ప్రధానితో ఏపీ సీఎం భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రెండు రోజుల హస్తిన పర్యటనకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. వీరిరువురు గంటన్నరపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమరావతి, పోలవరం నిధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ రహదారుల అభివృద్ధి, రైల్వే జోన్ శంకుస్థాపన, సెయిల్‌లో విశాఖ స్టీల్ విలీనం, ఇటీవల సంభవించిన వరద బాధితులను ఆదుకొనేందుకు కేంద్రం నుంచి సాయం తదితర అంశాలను చర్చించినట్టు సమాచారం. విభజన హామీలు కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది.

ఢిల్లీ జూ సభ్యత్వం రద్దు

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: ఢిల్లీ నే